# అక్కడ షాపింగ్ ఇష్టం!

ప్రయాణాల్ని ప్రేమించే సినీతారల్లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా ముందు ఉంటుంది. విహార యాత్రల్లో భాగంగా ఆమె విభిన్న ప్రదేశాలను సందర్శిస్తూ ఉంటుంది. వాటిలో తనకేం ఇష్టం, ప్రయాణ సమయంలో ఎలాంటి డైట్ ఇష్టపడుతుంది, ఇంకా ఏమేం చూడాలనుకుంటున్నది.. రకరకాల సంగతుల్ని చెప్పుకొచ్చిందిలా..

**నాకు** ప్రయాణాలంటే ఇష్టం కాబట్టి, మీ ఫేవరెట్ డెస్టినేషన్ ఏంటి? అని అడుగుతుంటారు. నాకు, సైఫ్‌కు స్విట్జర్లాండ్ చాలా ఇష్టం. మేమిద్దరమే అయితే అక్కడికే వెళతాం. అదే స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలంటే బీచ్‌లు ఇష్టం. అక్కడైతే నీళ్లతో ఆడుతూ సరదాగా గడపొచ్చు. షాపింగ్ కోసం వెళ్లాలనుకుంటే దుబాయ్, న్యూయార్క్ ఎంచుకుంటా. మొత్తానికి నాకిష్టమైన ప్రదేశం అన్నది నేను వెళుతున్న సందర్భాన్ని బట్టి ఉంటుందన్న మాట!

**ఇండియాలో** అయితే లద్దాక్, రాజస్థాన్ బాగా నచ్చుతాయి. నేను షూటింగ్ కోసం లద్దాక్ చాలాసార్లు వెళ్లాను. వెళ్లిన ప్రతిసారీ మరింత అందంగా, ప్రత్యేకంగా కనిపిస్తుంది. రాజస్థానీ రుచులు వారెవ్వా అనిపిస్తాయి. చుట్టూ కనిపించే నిండైన రంగులు పండుగ వాతావరణాన్ని తలపిస్తాయి.

**ఇక,** ఎయిర్‌పోర్ట్ లుక్ గురించి చెప్పాలంటే.. ప్రయాణాల్లోనూ అందంగా ఎలా కనిపిస్తారని నన్ను అడుగుతుంటారు. జర్నీకి ముందు, తర్వాత కూడా నేను చక్కగా నిద్రపోతా. మొదట్లో జెట్ లాగ్ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు కూడా అలా అనిపిస్తే బాగా నిద్రపోతా, నీళ్లు తాగుతా. మజిలీ చేరగానే ముందు నేను చేసే పని, ప్రశాంతంగా గ్రీన్ టీ తాగడం. అది ప్రయాణ బడలికను పోగొడుతుంది.

**నాకు** విదేశీ రుచుల కంటే ఇంటి భోజనమే ఇష్టం. ఎక్కడికి వెళ్లినా ఇటాలియన్ వంటకాలతో పాటు రెడ్‌వైన్ నా ఫేవరెట్లుగా ఉంటాయి. బయట రిస్క్ ఎందుకులే అనిపించినప్పుడు మాత్రం శాకాహారం తింటాను.

**మనం** నిజమైన పాఠాలను పుస్తకాల నుంచి కంటే బయటి ప్రపంచం నుంచే నేర్చుకుంటాం. ఎన్నో ప్రదేశాలు తిరిగా. ఇన్నాళ్లలో ఒక విదేశీ భాషో, ఒక సాహస క్రీడో, పోనీ ఫొటోగ్రఫీనో.. నేర్చుకుని ఉంటే బాగుండేది కదా అనిపిస్తూ ఉంటుంది అప్పుడప్పుడు.

**నేను** వెళ్లాలనుకుంటున్న ప్రదేశాలు చాలానే ఉన్నాయి. అందులో ముందుగా.. చైనా, మచుపిచ్చు చూడాలనుంది. అంటార్కిటికా సాహసయాత్ర చేయాలి. మనదేశంలో ఈశాన్య రాష్ట్రాలు.. ముఖ్యంగా మేఘాలయ వెళ్లాలి. అక్కడి టీ తోటల అందాలను ఆస్వాదించాలి.



Kareena Kapoor

నమస్తే తెలంగాణ

# జిందగీ

13

కరీంనగర్ | ఆదివారం 8 అక్టోబర్ 2023 www.ntnews.com

# అష్టకష్టాలు దాటి..

ఒక జాతీయ అవార్డు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, రెండు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు.. రక్షిత్ శెట్టి వెండితెర ప్రయాణం వైవిధ్య భరితంగా సాగుతున్నది. ఈ కన్నడ హీరో కమనీయ ప్రేమగాథ తెలుగులో 'సప్త సముద్రాలు దాటి..' ప్రేక్షకాదరణ అందుకుంటున్నది. షార్ట్ ఫిల్మ్‌తో మొదలుపెట్టి పాన్ ఇండియా వైపు సాగుతున్న రక్షిత్ జీవితానుభవాలు..

**సూట్‌కేస్ నిండా** బట్టలు, గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో బెంగళూరులో అడుగుపెట్టే సమయానికి నా లక్ష్యం ఒక్కటే.. ఎలాగైనా సినిమాల్లో నటించడం. ఉద్యోగం ఓ సాకు మాత్రమే. ఐటీ కంపెనీలో కొలువు చేస్తూ.. సినిమాలకు సంబంధించిన పుస్తకాలు తెగ చదివేవాణ్ని. నేను ఏ ఫిల్మ్ స్కూల్‌లోనూ చేరలేదు. నా థాట్ ప్రాసెస్ నాదే. నామీద ఎవరి ప్రభావమూ లేదు. పడిలేస్తూ నేర్చుకున్న పాఠాలే ఎక్కువ.

**గతంతో** పోలిస్తే కన్నడ సినిమా చాలా మారిపోయింది. పరిధిని విస్తరించుకుంది. ప్రయోగాలను ఇష్టపడుతున్నది. వైవిధ్యాన్ని ఆదరిస్తున్నది. దీనివల్ల నటులు, దర్శకులు, రచయితల బాధ్యత పెరిగింది.

**ఖాళీ** దొరికితే నేను చేసేది రెండు పనులే. పుస్తకాలు చదవడం. సినిమాలు చూడటం. వెబ్‌సిరీస్ అంటే చాలా ఇష్టం. 'అదో వ్యసనంగా మారిపోతుంది రోయ్!' అని స్నేహితులు హెచ్చరించేవారు. అయితే కానీ, మంచి వ్యసనమేగా? అనుకునేవాణ్ని. కానీ, గంటలకొద్దీ సమయం ఐస్‌క్రీమ్‌లా కరిగిపోతున్న సంగతి కాస్త ఆలస్యంగా గుర్తించాను. దీంతో వెబ్ సిరీస్‌కు పరిమితి పెట్టుకున్నాను. భోజన ప్రియుడినే కానీ వంట రాదు. మ్యాగీ చేసుకోగలను. కొర్ర రొట్టెలు ఇష్టం.

**ఐటీ** ఉద్యోగం మహా బోరింగ్. కాకపోతే ఖాళీ దొరికేది. పర్సు నిండా డబ్బులు ఉండేవి. బెంగళూరు వీధుల్లో షికార్లు చేసే వాడిని. సముద్రతీర ప్రాంతం మాది. దీంతో సంద్రంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. నా దృష్టిలో ప్రేమ కూడా సాగరం లాంటిదే.. అపారం. ఆ అనంతాన్ని రెండున్నర గంటల్లో తెరమీద చూపించడం ఏ దర్శకుడికైనా సవాలే. అర్థమైంది.. ప్రేమ అనగానే, నా పెళ్లి గురించి ఆలోచిస్తున్నారు కదూ! ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు.

**తెల్లవారు** జామునే మూడింటికి లేవడం నాకు అలవాటు. దీనివల్ల చేతిలో చాలా సమయం ఉంటుంది. అభిమాన తారల విషయానికొస్తే.. అనంత్‌నాగ్ నా అభిమాన హీరో, ఐశ్వర్యరాయ్ ఇష్టమైన హీరోయిన్. త్వరలోనే 'సప్త సముద్రాలు దాటి' పార్ట్-బీ కూడా ఉంటుంది. కథ విషయానికొస్తే.. తొలి భాగానికి భిన్నంగా ఉంటుందని మాత్రం చెప్పగలను. కొత్త మలుపులతో ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయం.





..Tollywood Elevations..



కొన్నేళ్లుగా సినిమా మొత్తం హీరోయిజం చుట్టూనే తిరుగుతున్నది. కథకోసం హీరోను వెతికేరోజులు పోయాయి. హీరో చుట్టూ కథలు అల్లే కాలం నడుస్తున్నదిప్పుడు. ఈ మధ్య అయితే.. మరీ ముఖ్యంగా 'కేజీఎఫ్' వచ్చినప్పట్నుంచీ ఎలివేషన్స్ ఓ ట్రెండ్‌గా మారిపోయాయి. హీరోని ఎంత ఎలివేట్ చేస్తే సినిమాకు అంత ప్లస్ అని దర్శకనిర్మాతలు బాగా నమ్మేశారు. కానీ ప్రేక్షకులు మాత్రం ఏమీ పాలుపోక, అర్థంకాక త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నారు. సినిమా మనిషి జీవితంలో భాగమైపోయింది కనుక.. వినోదానికి సినిమాను మించిన సాధనం లేదు కనుక.. సామాన్యుడికి ఖాళీ సమయంలో సినిమానే గతి కనుక.. ఎలా ఉన్నా చూడాల్సిందే. అప్పుడప్పుడు మాత్రం ఆత్మసంతృప్తినిచ్చే సినిమాలు తగులుతుంటాయి.. భాగ్యలక్ష్మీ బంపర్ లాటరీలా! అసలు 'హీరోయిజం' విషయంలో సినిమాల ధోరణి సరైనదేనా? అనే విషయాన్ని కాస్త సునిశితంగా విశ్లేషించుకుందాం.

# తెలుగు సినిమా హీరోయిజం!

**హీరోయిజం..** ఎలివేషన్స్.. వీటికి విత్తనం ఎక్కడ పడిందో తెలుసా? 'రామాయణం'.. అవును.. రామాయణం నుంచే హీరోయిజం అనేది మొదలైంది. హీరోయిజాన్ని ఆవిష్కరించిన తొలి రచయిత వాల్మీకి. అసలు రామాయణంలో ఉన్నంత హీరోయిజం, ఎలివేషన్స్ ఈనాటికీ ఎక్కడా మనకు కానరావు. ముఖ్యంగా రామాయణంలో 'మారీచ ఉవాచ' చదివినవాళ్లకు ఎలివేషన్ అంటే ఏంటో అవగతమవుతుంది. హీరోనీ, హీరో క్యారెక్టర్‌నీ, హీరో కెపాసిటీనీ, కేపబులిటీనీ 'మారీచ ఉవాచ'లో వాల్మీకి చెప్పిన తీరుకు ఆకాశమే హద్దు. అందుకే, నేటికీ రాముడ్ని మించిన మాస్ హీరో లేడు. రామాయణాన్ని మించిన జనరంజక కావ్యం లేదు. చివరికి మహాభారతంలోని కొన్ని ముఖ్య పాత్రల విషయంలోనూ రామాయణ ప్రభావం ఉంటుందనేది పండితాభిప్రాయం. ఏదేమైనా, మన కావ్యాలు ప్రపంచానికే ఆదర్శం. ఇది నిజంగా దేశానికే గర్వకారణం. అయితే.. వాల్మీకి, వ్యాసభగవానుడు సమాజానికి మంచి చెప్పడానికి సృష్టించిన ఈ ప్రక్రియ నేటి క్రియేటర్లకు కమర్షియల్ ఫార్ములా అయి కూర్చుంది.



## అప్పట్లో.. కథే హీరో

తెలుగు సినిమా విషయానికొస్తే.. తొలినాళ్లలో కథే హీరో. అందులో పాత్రధారులు మాత్రమే ఉండేవారు. అలాంటి సమయంలో, 'పాతాళభైరవి'తో హీరోయిజం అనేది పుట్టుకొచ్చింది. ఎన్టీరామారావు సూపర్‌స్టార్‌గా అవతరించారు. ఆయన్ని దృష్టిలో పెట్టుకొని కథలు తయారు చేయటం మొదలైంది. అంతటి ఇమేజ్ వచ్చాక కూడా రామారావు మాస్ పాత్రల కోసం వెంపర్లాడలేదు. సాంఘిక సినిమాల్లో సగటు మనిషిలాగే కనిపించేవారు. జానపద, చారిత్రక కథల్లో మాత్రం కత్తులు ఝళిపిస్తూ మాస్ మెరుపులు మెరిపించేవారు. ఆ విధంగా, అటు క్లాస్‌నీ, ఇటు మాస్‌నీ కట్టిపడేశారు ఎన్టీయార్. అక్కినేని విషయానికొస్తే.. ఆయన 250 పైచిలుకు సినిమాలు చేస్తే, వాటిలో దాదాపు 200 సినిమాల్లో సామాన్యుడిగానే కనిపించారు.. అలరించారు. ఏనాడూ నేలవిడిచి సాము చేయలేదు. డబ్బుకోసం సినిమాలు చేస్తూనే మధ్యమధ్య ఆత్మసంతృప్తికోసం కూడా కొన్ని చిత్రాలు ఎంచుకునేవారు. దేవదాసు, బాటసారి, అర్ధాంగి, తోడికోడళ్లు, మాంగల్య బలం, చదువుకున్న అమ్మాయిలు, కులగోత్రాలు.. ఆ తరహా సినిమాలే. వీటిల్లో హీరో ఏం వీరుడూ శూరుడూ కాదు, సామాన్యుడు.. ఆ విధంగా ఇద్దరు మహానటులూ వ్యక్తిగత హీరోయిజాన్ని పక్కన పెట్టి కథలను నమ్ముకునే ముందుకెళ్లారు. వీళ్లటైమ్‌లో అసలు ఎలివేషన్లే లేవు.. ఓన్లీ ఎమోషన్లే. వాటిలోనే అద్భుతమైన హీరోయిజం ఉండేది. తర్వాత వచ్చిన కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజులాంటి హీరోలు కూడా ఆ ఇద్దరినే అనుసరించారు. ఈ కారణంగా అప్పట్లో మంచి కథలొచ్చాయి. వెండితెర వెలిగిపోయింది.

### ఎమోషన్స్ వర్సెస్ ఎలివేషన్స్

**పదిమందిని** కొట్టేవాడు.. పంచ్ డైలాగులు పేల్చేవాడు మాత్రమే హీరో కాదు. సగటు మనిషి కూడా హీరోనే. ప్రేక్షకుడు తనకు తాను ఐడెంటిఫై చేసుకునేలా తెరపై హీరో పాత్ర ఉండాలి. జనాలకు కావాల్సింది ఎలివేషన్స్ కాదు. పక్కా ఎమోషన్స్. బాలీవుడ్‌లో మాస్ ఇమేజ్ ఉన్న ఆమిర్‌ఖాన్ 'దంగల్' ఎందుకు చేశాడు? సల్మాన్ 'భజరంగీ భాయిజాన్'గా ఎందుకు నటించాడు? ఆ సినిమాలు వందల కోట్ల వసూళ్లు రాబట్టాయి. హీరోయిజం కథలో ఉండాలి. పాత్రలో ఉండాలి. ఎలివేషన్లలో కాదు. మన యువహీరోలు నేల విడిచి సాము చేయకుండా నేలపై నడిచే కథలు చేస్తే తెలుగు సినిమాకు మంచి కథలొస్తాయి.

అందుకే ఆ కాలం స్వర్ణయుగంగా పేరుగాంచింది. కొంతకాలానికి ఎన్టీఆర్ ఆ పరిధులు దాటి ముందుకెళ్లారు. 'అడవి రాముడు'తో తెలుగు సినిమాలో ఎలివేషన్ల శకం మొదలైంది. సోషల్ సినిమాల్లో కూడా హీరోను అసామాన్యుడిగా, దైవాంశ సంభూతుడిగా చూపించడం మొదలైంది. ఏనుగులొచ్చి హీరో మెళ్లో దండలేయడం, సింహాలతో హీరో ఫైటింగులు చేయడం, అదిరిపోయే లెవల్లో హీరో ఇంట్రడక్షన్, పిచ్చెక్కించే లెవల్లో హీరో ఫస్ట్‌ఫైట్, హీరోయిన్లతో స్టెప్పులు, పవర్‌ఫుల్ పంచ్ డైలాగులు... ఇవన్నీ అడవి రాముడు చలవే. అక్కణ్నుంచి తెలుగు సినిమా నడకే మారిపోయింది. ఆ తర్వాత తరం చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, సుమన్, రాజశేఖర్ కూడా 'అడవి రాముడు' ఫార్ములాలోనే వెళ్లారు. మధ్యమధ్యలో ఆత్మసంతృప్తి కోసం ఇతర సినిమాలూ చేసేవారు. ఇప్పుడైతే హీరోయిజానికి, ఎలివేషన్లకూ పట్టపగ్గాలు లేకుండా పోయింది. హీరో అనేవాడు ఎంతమందిని నరికితే సినిమా అంత హిట్. హీరోపై ఎన్ని ఎలివేషన్లుంటే సినిమాకు అంత ప్లస్సు. కానీ, ఎలివేషన్సే సర్వస్వం అనుకుని.. కథను నిర్లక్ష్యం చేస్తే మాత్రం చేదు అనుభవం తప్పదనే కఠిన వాస్తవం ఇప్పటికే తారలకు బోధపడింది. దారి మార్చుకుని కొత్తగా ప్రయత్నిస్తున్నవారూ ఉన్నారు. ఎలివేషన్ బిర్యానీలో మసాలా లాంటిది. ఆ ఘాటు బిర్యానీ రుచిని మింగేయకూడదు.

... నరసింహా బుర్రా

# కుమారిగా మారిపోయి..

సినిమాలతో సమానంగా వెబ్‌సిరీస్‌లూ క్రేజ్ సంపాదించుకున్నాయి. అగ్ర నటులు కూడా ఇటువైపు మొగ్గుతున్నారు. ఆ జాబితాలో చేరడమే కాదు, ఓటీటీలో మంచి హిట్‌నూ అందుకున్నది టాలీవుడ్ ముద్దుగుమ్మ.. నిత్యామీనన్. 'అమెజాన్ ప్రైమ్'లో ఆడుతున్న 'కుమారి శ్రీమతి' వెబ్‌సిరీస్‌లో మధ్యతరగతి పల్లెటూరి అమ్మాయి పాత్రలో మెరిసింది ఈ అమ్మడు..

**అనుకున్నది** సాధించి తీరాలనే మొండి పట్టుదల ఉన్న పాత్ర శ్రీమతి. ఆ అమ్మాయి హీరో నాని వీరాభిమాని. వెబ్‌సిరీస్‌లో ఈ పాయింట్ నాకెంతో నచ్చింది. నా తొలి సినిమా 'అలా మొదలైంది'.. నానీతోనే చేశాను. దీంతో నాని అభిమానిగా నటించడం సరదాగా అనిపించింది.

**ఈ** మధ్య నేను చేసిన అన్ని పాత్రలూ గ్రామీణ నేపథ్యానికి చెందినవే. గలగలా మాట్లాడే పల్లెటూరి అమ్మాయిగా నటించడం ఇది మూడోసారి. గత ఆగస్టులో వచ్చిన తమిళ సినిమా 'తిరుచిత్రాంబలం'లో శోభన పాత్ర కూడా ఇలాంటిదే. తర్వాత చేసిన మలయాళ సినిమాలో కూడా ఇలాంటి నేపథ్యమున్న క్యారెక్టరే నాది.

**నేను** పల్లెటూరి ఆడపిల్ల పాత్రకు అంతగా సరిపోనని నా నమ్మకం. అందుకే వాళ్ల హావభావాలు, మేనరిజం కంటే ముందుగా.. పాత్ర స్వభావం తెలుసుకుని ఆ ప్రకారంగా నటిస్తా. అలా పాత్రకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నా. ఏ పాత్ర అయినా.. డైరెక్టర్‌తో చర్చించి నేను చేయగలనన్న నమ్మకం వచ్చాకే ఎంచుకుంటాను. కొత్త వెబ్ సిరీస్ విజయం ఉత్సాహాన్నిచ్చింది.

